కథానిక

# "రా, కవిత లెరిగినదాన! రా!"

సరళ

కౌత వైపులో పరధ్యానముగ మంజుల మందస్వరాలు తీస్తూ కవి ఆనందుడు రాజమార్గంపై మెల్లగా వెళుతున్నాడు. మధ్యాహ్నం ముగియువేళ. మందసమీరుడు మెల్లగా వీస్తున్నాడు. బాట కిరువైపులనుండి పొదరిండ్లలోని పూగుత్తులు పరిసరప్రదేశాన్ని పరిమళంతో నింపుతూన్నాయి. రాజమార్గం నిర్జనమై, శాంతియుతమై చెన్నారుతూవుంది. ఆనందుడు ఒక పూపొదరిల్లు జేరి తన హృదంతరాళంనుండి పైకుబుకు నూతన భావాలను గంటముతో తాటాకులపై చెక్కుతున్నాడు. ఇలా యెంతసేపు వ్రాసినాడో అతనికే తెలియదు. తనచుట్టూ రాజసైనికులు యెప్పుడు మూగినారో, ఒక సుందరనారీమూర్తి తన యెదుట యెప్పుడు ప్రత్యక్షమైనదో అప్పుడే అతడు తన భావనాపథంనుండి వాస్తవిక వాతావరణానికి జారినాడు... అతని గంటము అప్రయత్నముగా నిలిచింది.

అమాయకునిబోలె నారీమూర్తిని పరికించి "మీకేమి కావాలి?" అన్నాడు. "ఇదే నిన్ను అడగాలి. ఈ మార్గానికి నీ వెలా వచ్చావు? రాజాజ్ఞచే నీవు బంధీకృతుడవు" అన్నది స్త్రీమూర్తి

"కవి నెవ్వరు బంధింపగలుగుదురు దేవీ? మీరు పొరపడ్డారేమో."

"ఇది రాజపథం ఇందు నాగరికులు నడువ హక్కులేదు. రాజాజ్ఞను ఉల్లంఘించువారు దండనార్హులు. నాగరికులకు జనపథం వున్నది కదా. ఉత్తరువు లేనిదీ రాజమార్గంపై నడువడం అపరాధం కాదూ?"

"అపరాధమా! ప్రకృతిని లాలస దృష్టితో చూచుటలోకూడా అపరాధం కలదు కాని ఈశ్వరీయ నియమంతో అది అంతర్గతమై యున్నది. రాజమార్గంపై నడుచుటయే అపరాధమైన యిదిగో నే వెడుతున్నా" నంటూ కవి కూనిరాగాలతో బయలుదేరాడు.

"ఏయ్...నీవు వెళ్ళలేవు, నిలు."- నారీమూర్తి శాసించింది.

ఆనందు డాగినాడు. ఇరువురు సైనికులు అతని హస్తాలను బంధించినారు. అతడు ధిక్కరించ లేదు.

మరల ఆజ్ఞ అయింది- "ఇక నడువు... రేపు రాజసభలో హాజరుకావాలి నీవు."

కారాగృహంవైపు అందరూ బయలుదేరారు. కొంతసేపటికి ఆనందుడు యిలా అన్నాడు- "నన్ను బంధీకృతుని గావించినవారిని నేను తెలుసుకోగలనా?"

"రాజకుమారి నీరజకుమారి."

ఆనందుడు ముదితుడైనాడు. "మీరుకూడా కవిత నారాధించువారేనా?"

"కవి కల్లరియగును బందీ! మిథ్యాప్రలాపంతో తన కాలాన్నీ, జీవితాన్నీ నాశమొందించుకుంటాడు. కవులంటే నాకు తీరని కోపం!"

"కవిత అంటే యేమిటో మీరు తెలుసుకోవాలి. సాహిత్య మాధుర్యాన్ని విసర్జించి జీవితంలో రసాస్వాదనకై మీరు అన్వేషించగలరా?"

"ఓయి నాగరికుడా! నీవు బందీవి. నీ పరిధిని దాటివెళ్ళకు నీవు...ఆఁ, మరి నీ వేమంటివి!"

"ఆనందుడు ... నావాణిని మీరు బంధించలేరు రాజకుమారీ! నాశరీరాన్ని మరీ బలముగా బాధించినా నా వాణిమాత్రం స్వచ్ఛందమై యుంటుంది."

తీక్ష్ణ దృక్కులతో రాజకుమారి నీరజ ఆనందుని మరీ సమీపించి- "కారాగృహంలో కూడా, నీళ్లూ లేనప్పుడు కవిత్వం యేమిటో తెలుసుకొంటావు. సాహిత్య వివేచనకై యిలాగే చేయాలి."

"అలాగే కానివ్వండి. కారాగృహంలో బంధించినా కవితాధార ఏ అడ్డూ లేక ప్రవ

హిస్తూనే వుంటుంది. ఇక్కడ బయట నుండిన అన్నిటినీ పరికించి మనస్సు అస్థిర మౌతుంది. కవి తన చంచల మనస్సును బంధించుటకు ప్రయత్ని స్తాడు... రెండు రోజులుగా నేను వస్తున్నాను. నా గొంతుక బందీకాని గొంతు కాదు దేవీ! నా స్వరంలో కుంటు లేదు. నా వాక్కునకు భయం లేదు. నా కవిత నాతోనే వుంటుంది."

"నీకు వ్రాతపరికాలను యివ్వకున్న మరి దేనిపై వ్రాయగలవు?"

"నా హృత్ఫలకముపై వ్రాయగలను... వ్రాత పరికరాలు లేని కాలంలో యెవ్వరు మాత్రం వ్రాస్తూ వుండిరి? అంతా తమ కంఠం లోనే యిముడించుచుండిరి కదా! నామార్గాన్ని యెందుకు అడ్డగిస్తారు? నారి స్వయం కోమల మైనది కదా, పేశల హృదయ కదా! మరి మీ కెందుకీ కఠోరత?"

"నీవు దండనార్హుడవు బందీ! దయాపాత్రు డవు కాదు."

"ఇవన్నీ మీరు గ్రహిస్తారు రాజకుమారీ! సమయం సమీపిస్తున్నది. కవితాధార మీ హృదయ శిఖరశైలం నుండి వెలువడి మహా కోలంకషముగా నురుగు కెరటాలతో ప్రవహి స్తుంది. అందులో తుఫాను చెలరేగుతుంది. అప్పుడు మీరు 'శాంతి, శాంతి' యని కేకలిడు తారు. ఆ ఉన్మాదంలో మీరు మనశ్శాంతికై కావ్యపంక్తులను వల్లిస్తూ తిరుగుతారు. అప్పుడే కవి యెవ్వరనేది మీరు గ్రహిస్తారు... తన సర్వ స్వాన్నీ త్యాగంచేసి, తన రోమ రోమంలోను అగ్నిశిఖలను ప్రజ్వలింపజేసి ఆ మహాజ్వాలలో తన్ను తా భస్మమొందించు కున్నవాడు కవి రాజకుమారీ! అతని పాదాలకు అందరూ ప్రణ మిల్లాలి."

రాజకుమారి ఆనందుని వ్యంగ్య భాషకు రోషాన్ని ప్రకటించ లేదు.

'నీవు పిచ్చివాడవు కావు గదా బందీ?" అన్నది.

"నేనా? నేను పిచ్చివాడనే. మీరు మాత్రం పిచ్చివారు కాదూ? విశ్వమంతా వెర్రిది కాదూ? హాహాహ..." అట్టహాసంతో ఆనందుడు నడచి నాడు. సైనికులు యితని విచిత్ర మనస్తత్వానికి చకితులైనారు. రాజకుమారి నీరజ మాత్రం ఆనందునితో సంభాషిస్తూనే వుంది. అందుకు సైనికులు వూరుకున్నారు.

ఆనందుడు అధికంగా నవ్వినాడు. అతని అట్టహాసం ప్రతిధ్వనించింది. అతని కపోలం యెర్రబారింది. అయినా అత మూరుకో లేదు. ఒక దీర్ఘ నిశ్వాసాన్ని విడుస్తూ ఇలా అన్నాడు- "నావంటి దుర్బలవ్యక్తి జగతిలో మరొకడు దొరకగలడా రాజకుమారీ? పురుషుడైనా ఒక స్త్రీ ఆజ్ఞను జవదాటలేక పోయినాడు."

నీరజ తన కరాంగుళాలతో యెదుట నుండు యెత్తైన గోడలను చూపుతూ పలికింది- "ఇక నీ వ్యర్థాలాపమును కట్టిపెట్టు బందీ. ఆ యెత్తయిన గోడల మధ్య ఒక చీకటి కొట్టులో నీ వుండాలి. నీ విక తప్పించుకో లేవు. రేపు రాజసభలోకూడ యిలా పిచ్చికూతలు కూస్తే మరి మరణదండనకు పాత్రుడ వౌతావు."

ఆనందు డీమాటలను వినలేదు. తన ధోరణి లోనే తాను నడుస్తున్నాడు.

"జీవితంస్వయంగా ఒక కావ్యం రాజకుమారీ! యౌవనపు మొలక మీ అరుణాధరాలపై చిరు నవ్వులు వికసిస్తూవుంది. చిరుచెమటలుపోయియు మీ చెక్కిళ్లపై కెంజాయ తాండవిస్తూ వుంది మీ హృదయమందు వున్నట్టుండి స్పందనం యేర్పడుతూ వుంది. మీ హృదయ స్పందాన్ని నేను పూర్తిగా అనుభవిస్తున్నాను. ఈ నాపలుకు లనే కవిత్వ మంటారు. ఏది సత్యమైనదో, సుందర మైనదో అదియే కవిత."

రాజకుమారి నీరజ అతని మాటలను ఉపే క్షించుటకై యెంత ప్రయత్నించినదో అంత వానిలో తన్మయత్వం పొంగింది. అతని పలుకుల కెంతదూరముగా వొదలచిందో అంత వాటిలో లీనమైనది. ఎటు చూచినా అతని సుందర స్వరూపమే. ఎటు తిరిగినా అతని మృదు కంఠ స్వరమే. అతనిలో జ్ఞానతేజం యిమిడియుంది. అతడు వచించిన దానినంతా గ్రహించుటకు ఆమెలో ఆకాంక్ష జనించింది.

ఆనందు డామె మౌనాన్ని పరికించాడు. "ఏమి... ఎంతసేపు ఆలోచిస్తారు మీరు? నేను జీవితాన్ని యెలా పరికించానో అలాగే వర్ణిస్తు న్నాను. రాజపథాన్ని విడిచి మరి యెటూ మీరు వెళ్ళలేదు కాబోలు. వెళ్ళినా ఉద్యానవనాలకే

నేమో. మీ రాచబాటల, వనవాటికలచుట్టూ అనంతప్రదేశం వున్నది రాజకుమారీ! ఆ ప్రదేశాలనుకూడ పరికించండి... నా వలె మీరుకూడ బంధింపబడినారు. నా బంధనకూ మీ బంధనకూ భేదమేమిటి? నేను బలపూర్వకంగా బంధింపబడినాను. మీరు స్వేచ్ఛగా బంధింపబడినారు. నేను నా బంధనాలను తుత్తునియలు చేసి యెగిరిపోగలను. మీరు బంధన రహితులైకూడ బయటికి పోలేరు. ఇదీ ఒక జీవనమేనా మీది? మీరు రాకొమార్తెలు. మీకు కోరినదంతా కావాలి. కాని రాజప్రాసాదాలకు అవ్వలి ప్రదేశంలో జీవితం యెంత అద్భుతమైనదో, జను లెంత సుందరతరమైనవారో మీకు తెలియనే తెలియదు. నా వెంబడి వస్తారూ మీరు? ఏ జనమార్గం కంటకావృతమైనదో ఆ మార్గమందే మీకు నడువ నేర్పిస్తాను.''

నీరజహృదయం ఒక్కసారి జలదరించింది. నేడు ఆమె కేమయింది? ఆమె రాజకుమార్తెయైనా సాధారణ యువతియై పోయినదేమి?

''నీ వేమో చాలా చెబుతున్నావు కవీ! ఏం, నీ చేతులవలె నీ నోరునుకూడ బంధించమంటావా?''—అన్నది నీరజ.

''ఇప్పుడే నన్ను గ్రహించారు మీరు రాజకుమారీ! నన్ను కవీయని సంబోధించారు. కవివాణి అనశ్వరమైనది. కవి జ్ఞానం మహత్తరమైనది. అతనివాక్కును యింతవరకూ యెవ్వరు బంధింపగలిగినారు? యుగయుగాలు దాటిపోయినాయి. కాని కవులవాణి యింతవరకూ ప్రతిధ్వనిస్తూనే వుంది. కవుల కల్పనా గీతికలు అమందానందాన్ని చేకూరుస్తాయి. వీనిని విసర్జించి జీవితంలో పూర్ణానందాన్ని పడయలేరు మీరు.''

బాట రెండుగా చీలింది-ఒకటి రాజాంతఃపురాలకూ, మరొకటి కారాగృహానికీ. నీరజకు ఎటు వెళ్ళడానికీ తోచలేదు. ఆమె అచ్చటనే ఆగింది. తన ఆజ్ఞతోనే ఆనందుని కారాగారానికి పంపవలెనా లేక తన కోరికతోనే అతనిని రాజు నొద్దకు తోడ్కొనిపోవలెనా యను సంశయ మామెలో జనించింది.

ఆనందు డామె మనో విభ్రమమును గుర్తించినాడు.

''ఏమి టాలోచిస్తున్నారు? నేడు మీ యెదుట యే ప్రశ్నగా నే నవతరించినానో దానికి ప్రత్యుత్తర మేమిటాయనియే కదా? ఇది అంత కఠినతరమైనది కాదే!''

మసక చీకటిలో మరొకమారు ఆనందుని దెస పరికించినది నీరజ. కారాగృహమందలి పెనురాతి గోడలమధ్య బంధింప నాజ్ఞ నిచ్చుటకు ఆమెకు నోరాడలేదు. కాని రాజాజ్ఞను పాలించవలసినదే. రాకొమార్తెయైనా రాజనియమాలు అందరికీ ఒక్కటేకదా!

''మీకు నా విషయమై యెందుకూ అంతటి తీవ్రాలోచన? నాకు కారాగార శిక్ష నేటికి ప్రాప్తమైనదిగదా.''— సైనికుల ముఖమై— ''పదండి మరి, నే నెంత బడలినానో మీరు చూడ్డంలేదూ?''—అన్నాడు ఆనందుడు.

నీరజ హృదయంలో అవ్యక్తావేదన ఉదయమందింది. ఆనందుని కారాగృహంలో వుంచుట కాజ్ఞనిచ్చి అశాంత, అస్థిర, అత్యంత నిర్బల మనస్సుతో ఆమె అంతఃపురానికి కాళ్ళీడ్చింది.

* * *

నీరజకు రాత్రి కునుకేపట్టలేదు. కళ్లు మూసినపుడల్లా ఆనందుడు పిలిచినట్లు కలవరించింది. విపరీత స్వప్నాలు కంది. ఆనందుని చేతులు బంధింపబడినాయి. ఉరిశిక్షను పొందిన అపరాధి ధరించు నల్లగుడ్డలు అతని దేహంపై వ్రేలాడుచున్నాయి. ఆనందుడు నవ్వుతూనే వున్నాడు. ఆమెతో యిలా అంటున్నాడు—''రాజకుమారీ! ఇలారా, నాకు సెలవియ్యమరి; ఇక మన మిరువురము జీవితంలో కలుసుకోలేము.''

అతని దిక్కున కామె నడకను సాగించింది. అంతలో హఠాత్తుగా యెవరో అతనిని అవతలికీడ్చినారు. ఎక్కడా?...

''ఛీ? ఒక ఉన్మాదకవిని ప్రేమిస్తావూ? నిన్ను నీవు మరచిపోతున్నావూ? నీవు రాజకుమారివి కదూ! నిన్ను వరించుటకు రాకుమారులు లేరూ? ఏం, మీ వంశానికి అపకీర్తి తెస్తావూ? హాహాహా...హాహాహా...''

వెకిలినవ్వు ఆమె చెవులలో గింగురుమన్నది. దేహం కంపమెత్తింది. ఆమె తటాలున లేచి కూర్చున్నది. ఆమె గొంతుక యెండుకొనిపోయింది.

"ఇదంతా యేమిటి? నే నేమైనాను? ఆనందుని నేను ప్రేమిస్తున్నానా?"— నీరజ తన్ను తానే ప్రశ్నించుకొన్నది. తన గుండె దడదడను ఆమె స్పష్టముగా ఆకర్ణించింది.

ఎవరో పల్కినారు– "ఆనందుని నీవు ప్రేమిస్తున్నావు నీరజా... కాని అజ్ఞాతరూపంలో..."

నీరజ లేచి నిలబడింది. ఇదంతా కేవలం మనోభ్రమయే అనుకొన్నది.

"ఇలాటి ప్రేమకు నేను లోనగుదానిని కాను. నే నతనిని తగిన శిక్షకు పొందజేస్తాను... ఆనందుడు ఉరిశిక్షను పొందవలసినదే. అతడు రాజాజ్ఞను ఉల్లంఘించినాడు. దానికి తోడుగా నా మనోవైకల్యానికి కారణభూతుడైనాడు. ఇదంతా, యేం, అల్పమైన అపరాధమా?"

నీరజ దాసిని పిలిచింది. దాసి కన్నులు నులుముకుంటూ ప్రవేశించింది. ఆమె కేమి చెప్పాలో ఆలోచిస్తూ కూర్చున్నది నీరజ. చెప్పడానికి మాత్రం యేముంది? ఎకాయెకిని కోపంతో పలికింది—"ఎందుకొచ్చావు?"

"మీరు పిలిచారుకదూ?"

"వెళ్లు, వెళ్లు- నీకు చెప్పడాని కేమీ లేదు. రాత్రి నిద్రకూడా పోనీయవు"

రాజకుమారి ఆకస్మిక మనోపరివర్తనానికి దాసి విస్తుపోయింది. ఇదే మొదటిసారి. నిశీథంలో మేల్కొని యిలా ప్రవర్తించింది. ఎందుకో... తన మనస్సులో తాను చర్చించుకొంటూ చేతులు కట్టుకొని తిరోహిత అయింది దాసి.

నీరజ మనో వృత్తి పూర్తిగా మారింది. గవాక్షాలనుండి శీతల సమీరుడు యెంత వీచినా ఆమెకు స్వస్థత కలుగలేదు. కాలియాందెలు మ్రోగగా ఆమె పరువెత్తింది ... చదలుపై జాబిల్లి చల్లగా వెలుగుచున్నాడు. తమ అస్తిత్వాన్ని కోల్పోయి నోలది తారకలు మాత్రమే ప్రకాశహీనంగా మెరయుచున్నాయి. మందమరుత్తరంగాలు ఆమెను మెల్లగా సోకుచున్నాయి. రజనీగంధసుమాలు తమ సౌగంధ్యాన్ని నలుదిక్కులా వెదజల్లినాయి.

దారి వెంబడి పరుగిడింది రాజకుమారి. రజని సౌమ్యతను నేడే ఆమె అవలోకించింది. ఉన్నట్టుండి ఉన్నత కుడ్యాలతో చుట్టబడిన కారాగృహాపు నల్లగోడలు ఆమె దృష్టిని ఆకర్షించినాయి. మరుక్షణమే ఆమె నరాలు చల్లబడినవి. ఆయొత్తయినకట్టడం వెన్నెల్లో మరింత భయానకముగా అగుపడింది ఆమెకు. స్వచ్ఛందుడై విశ్వమంతటను విహరించు సుకుమార కవి లోహాపు కమ్మీల్లో బంధింపబడినాడు. ఆమె హృదయం అప్రయత్నముగా పలికింది:

"ఇది అన్యాయం. ఇతరులను ఖైదీలుగాజేసి కారాగృహంలో బాధించుటకు హక్కు మన కెక్కడిది? మానవుడు జన్మతః స్వతంత్రుడు కదా! మరి అతని కోసమై యీ వున్నత కారాగృహా లెందుకూ? వీని ఆవశ్యకత దేనికి? ఇది అన్యాయం... అత్యాచారము. నేను ఆనందుని బంధవిముక్త నొనరిస్తాను. అతనికి శిక్ష లేకుండ చేస్తాను. శిక్ష నిచ్చుటకు అతడు చేసిన నేరమేమి? ఈ విశాల రాజపథంపై రాజు, రాజపరివారముదక్క అన్యులు నడవనే కూడదా? ఇదేటి నియమము? కేనీ నియమాలను రద్దు పరుస్తాను. ఆనందునివైపు మహారాజుతో వాదిస్తాను."

నీరజను ఈ ఉన్మాదము పూర్తిగ లోబరచుకొన్నది. ఆమె అచ్చటనే ఆగిపోయింది. శీతల సమీరుని సున్నిత స్పర్శ జోకొట్టుటగా మారింది. తరుపత్రముల గల గల ధ్వనులు జోలపాటగా మారాయి. ఆమె కనులు మూతపడినాయి... కునుకు వచ్చింది... రాచబాటపైనే ఒడలు మరచి నిద్రించింది.

ప్రత్యూషరేఖలు తూర్పున పొటమరించినాయి. పరిమళ మిళిత ప్రాతర్మందానిలాలు గిలిగింతలు పెట్ట నారంభించినాయి. ఆ గిలిగింతలకు నీరజ మేల్కొన్నది... కనులు విచ్చి పరికించింది... 'నే నెచట నిద్రించినాను?"... తన వెర్రికి తానే నవ్వుకొన్నది...

* * *

నియమానుసారము రాజదర్బారు ఆరంభమయింది. మహామంత్రి, మహాదండనాయక, సేనాపతి, సామంతాదులు అప్పుడే నియమితాసనాలను స్వీకరించినారు. మహారాజు ఆగమనానికి ఇంకా కొంతగడువున్నది. రాజకుమారి నీరజ మహారాణి ప్రక్కను వచ్చి ఆసీనురాలయింది. మరి కొన్ని క్షణాలకు రాజాగమనాన్ని దండధరుడు విన్నవించాడు. మహారాజు ఏతెంచి రాజసింహాసనంపై ఆసీనుడైనాడు.

అత్యావశ్యక రాజ్యకార్యాలు అయిన తరువాత ఆనందుని రాజసభలో ప్రవేశ పెట్టినారు. అతడు వెనుకటి దినము వలెనే చుఱుకుగా వున్నాడు. అతని ముఖంలో దైన్యము లేదు. అతని నడకలో కుంటు లేదు. అతడు రాజున కెదురుగ నిలబడి అతనికి నమస్కరించినాడు. సభాసదులందరూ అతనిపై దృష్టి నిగుడించినారు నీరజ ఆత్రుతతో విచారణను వినుటకు సిద్ధమయింది.

దండనాయకుడు ఆనందుని నేరమును రాజునకు విన్నవించినాడు. న్యాయోచిత దండనకై అర్థించినాడు. మహారాజు ఆనందు నొకసారి యొగాదిగ చూచినాడు. "నీ నేరాన్ని ఒప్పుకొంటావా బందీ?" అన్నాడు.

"లేదు ప్రభూ!"

"ఎందుకూ? రాచబాటపై నడుచుటకు నాగరికులకు హక్కు లేనప్పుడు నీ వెందుకొచ్చావు అక్కడికి?"

"నా పరంగా నన్ను వాదింప నివ్వండి ప్రభూ! నా యిచ్చవచ్చినట్లు నన్ను మాట్లాడ నివ్వండి."

"అలాగే, కాని రాజ్య నియమాలకు నీవు నిబద్ధుడవు. అన్యథా, హెచ్చుగా దండనార్హుడవు కాగలవు."

"మీ ఆజ్ఞను తలదాల్చెదను ప్రభూ."

నీరజ వున్నట్లుండి విహ్వలచిత్తయైంది. ఆనందు డేమి చెప్పగలడు? భావుకతలో కలిసి పోయిన మరీ హెచ్చుగా దండనార్హుడు కాగలడే! నీరజ లేచి నిలబడి యేమో చెప్పుట కుద్యమించింది. రాణి పట్టుకొని కూర్చోబెట్టింది. "ఏమి నీరజా! నీ వెక్కడినుండి మాట్లాడుతావు? రాజమార్గంపై నడచు నాగరికులకు దండనయే లేకున్న రాణాంతఃపురాంతరాలకు కూడ చొరబడరుందురా వీరు?"

"ఇతడు కవి తల్లీ! జగత్తునంతటినీ ధిక్కరించగలడు. ఇతడు శిక్షను స్వీకరించుటకు కూడ సిద్ధమైనాడు."

"విను, విను... అతడేమో చెబుతున్నాడు."

నీరజ తన మనస్సును ఆనందునిలో పూర్తిగా కేంద్రీకరించింది.

ఆనందు డిలా అంటున్నాడు—

"ప్రభూ! మీరు సాహిత్యప్రియులని నేను వినియున్నాను. విశ్వేతిహాసంలో మీ యశశ్చంద్రికలు దశదిశలు శాశ్వతముగా సాంద్రతరమై వ్యాపింపగలవు. దానికొరకు మీరీ రాజప్రాసాదాలను విసర్జించాలి... రాచ బాటపై నడచెడు అమాయకులైన నాగరికులను బంధించి, వారికి శిక్షలనిచ్చి మీ రెన్నటికినీ సత్యంయొక్క స్వస్వరూపాన్ని దర్శింపలేరు. మీ ప్రజల హృదయంలోనికి మీరు చొచ్చుకొని పోవాలి ప్రభూ! రాచబాటలవలె నాగరికుల మనస్సులు కూడ వినిర్మలమైనవే.

"కాని వారు భయభ్రమా పీడితులు. వారి జీవిత మధుర సంగీతం నేడు లుప్తమైపోయింది. మంద్రత జెందిన వారి కంఠస్వరం నీరసిల్లి విలుప్తమౌతూవుంది... మీరు సహృదయులు. ప్రజాప్రియులు. మరి వారివైపు శ్రద్ధచూపండి... రాజకుమారి నీరజాదేవికి తెలిసేవుంది-నేను రెండు రోజులుగా వస్తున్నానని. నిన్నటిదినం కారాగృహంలోకూడ బొత్తిగా తిండి దొరకలేదు. అయినా నేను మాట్లాడ శక్తికలిగియున్నాను. నేను కవిని అన్నదాతా! దరిద్రుడను... తిండిలేనివాడను. కళ, సాహిత్యం-వీని రెంటికై నా జీవితాన్నంతా ధారపోస్తున్నాను"-అంటూ ఆనందు డెవరికొరకో నలుదిక్కుల కలయజూచినాడు.

నీరజ వ్యాకులత జెంది పంజరంలోని పక్షివలె తనలో తానే కుమిలింది.

రాజు తదేక దీక్షతో వింటున్నాడు.

ఆనందుడు మరల ప్రారంభించాడు-

"మీ ప్రజా ర్తనాదాలు నాచెవిని సోకినాయి ప్రభూ! వారి గద్గదికవాణి నాచెవుల్లో గింగురుమంటూ వుంది. వారిని అన్యాయం అను తిరగలిలోవేసి విసురుతున్నారు మీరు. నన్ను నే నడ్డుకోలేను ప్రభూ! కవి కంఠం ఆకలిగొన్న వారల స్వరం ... సామాన్య జనతార్తనాదం. వారి ఆర్తనాదాన్ని మీవరకూ తెచ్చుటకు నేను పూనినాను... నియమాలను నిరసించినాను. మీరు ప్రాణదాతలైనా మీ ప్రజల సంతాపాన్ని యెందుకూ తీర్చలేరు?"

"ఇంకా చెబుతూ సాగు కవీ! నీ ఉదాత్త భావాలను నే నాదరిస్తాను."

సభాస్తారు లందరూ ఆనందుని చతురతను వెరగొందినారు. మహామంత్రి మహారాజును సమీపించి లోగొంతుక స్వరంతో అన్నాడు- "బందీకాడు, అనర్గళ ప్రలాపి ప్రభూ! అతనిని వాగనిచ్చిన ప్రమాదం సంభవిస్తుంది. త్వరగా శిక్షనిచ్చి కారాగృహానికి పంపుట మేలు. దేవర వారి ప్రజలందరూ శాంతి సౌఖ్యాలను అంది యున్నారు."

"అతని భాషణ అంతమొందువరకూ మన కధికారం లేదు మంత్రీ. అతని భాషణను మనం దీక్షతో విందాము."

మహామంత్రి మౌను డైనాడు.

ఆనందుని కనుగవ నీరజను వెదుక నారంభించింది. ఆమెనే స్మరిస్తూ వెనుకటి దినం ఆమెతో అన్నమాటలనే తిరిగి వల్లించినాడు... "రాజపథాన్ని జనత కర్పించాలి ప్రభూ! ఈ నగరు నెన్ని నియమాలతో ప్రజలకు దూరంగా వుంచినారో ఆ నియమా లన్నిటినీ రద్దుపరచాలి. ప్రజల వాక్ స్వతంత్రతకు దోహద మివ్వాలి. రాజకుమారి నన్ను కారాగృహంలో వుంచుట కాజ్ఞ నిచ్చింది. ఐనా అది రాజాజ్ఞ. ఒక్క రాత్రిలోనే అంధకార బంధుర శిలాకుడ్యాంతర జీవితాన్ని పూర్తిగా అవలోకించాను. అందరూ స్వేచ్ఛగా వుండాలని తోచింది. స్వాతంత్ర్యం యొక్క విలువను యెవ్వరూ చూరగొన లేరు ప్రభూ. అందరినీ బంధవిముక్తుల నొనరిస్తారని నా ఆశయం."

"ఇంకా చెప్పాల్సింది వుందా కవీ?"

నీరజ హృదయం దడదడ కొట్టుకొన్నది. ఆనందుని ప్రత్యేకంగా బంధింప నాజ్ఞ నిస్తారేమో?

ఆనందుడు మెల్లగా, మృదువుగా అన్నాడు- 'నే వెళ్లుట కాజ్ఞ నివ్వండి ప్రభూ! నాకార్యం సమాప్తి నొందింది. నేను... నేను...—" అతని దృష్టి నీరజపై బడింది. మరి పలుక లేక పోయాడు.

"నీవు బంధవిముక్తుడవు ఆనంద్. కాని నీ విప్పుడే వెళ్లరాదు. మా కతిథివై కొలది రోజు లుండి మరీ వెళ్లవలెను."

ఆనందుడు నమ్ర శిరస్కుడై రాజు మాట ఆలకించాడు. నీరజ అచ్చెరు వొందింది. సభాస్తారులందరూ ఒకరి నొకరు చూచుకొన్నారు.

కొలువు ముగిసింది.

[అనువాదం: ఆర్. సోమసుందరరావు- వచ్చేసంచికతో ఆఖరు.]

ఆంధ్రదేశంలో తుపాను

# ప్రకృతి దౌష్ట్యానికి ప్రతిక్రియ లేదా?

రావెళ్ల హనుమంతరావు

మొన్న కృష్ణానది పొంగి పొరలటంతో వరదలు. నేడు సముద్రుడు విజృంభించి ప్రళయరూపం దాల్చటంతో పెనుతుపాను. రేపేదో? ఎల్లుండి మరే ప్రమాదమో? "ఏమి జన్మం బేమి జీవనము - ఏమి లోకమురా?" అని సన్యాసులు పాడుకునే తత్వాలు జ్ఞప్తి కొస్తున్నాయి.

కృష్ణానది పొంగి వరదగా వచ్చి ఆంధ్ర ప్రజలకు విశేషంగా నష్ట కష్టాలు కల్గించి ఆరేడు వారాలు పూర్తి కాలేదు. అప్పుడే మళ్లీ సముద్రుడు విజృంభించి మరింత విపరీతమైన నష్ట కష్టాలను సంప్రాప్తం జేశాడు. ఆనాడు యిళ్లు పోగొట్టుకొన్న అభాగ్యు లింకనూ తిరిగి వాటిని నిర్మించుకో లేదు. వాళ్ల కొరకు ప్రభుత్వ మివ్వ నిర్ణయించిన విరాళ మింకనూ పంచటం పూర్తి కాలేదు. వాళ్ళ సహాయంకొర కేర్పడిన కమిటీలు ఇంకనూ పని ప్రారంభించ లేదు. అప్పుడే మళ్లీ మరొక ప్రక్కనుండి తుపాను వచ్చి పడింది.

ఈ భయంకరమైన పెనుతుపాను వల్ల ఎన్నో వేల వ్యవసాయ కూలీల ఇళ్ళు నేలమట్టమై పోయాయి. ముఖ్యంగా హరిజనులు నివసించే